క్లుప్తంగా

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో వేంచేసిన ఉమారామ లింగేశ్వరస్వామి వారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు ఆధ్వర్యంలో స్వామి వారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం వివిధ రకాల పూలతో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మేడేను జయప్రదం చేయండి

పెద్దాపురం: మేడేను జయప్రదం చేయాలని ఏపీ అంగన్ వాడీ కార్యకర్తలు, సహాయకుల సంఘం సీఐటీయూ అధ్యక్షుడు దాడి బేబీ పిలుపునిచ్చారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో మంగళవారం పుష్పాల సావిత్రి అధ్యక్షతన ప్రాజెక్టు సమావేశం నిర్వహించి పోరాట వారసత్వాన్ని వాడవాడలా జెండా రూపంలో ఎగురవేయాలని ఆమె పిలుపునిచ్చారు. సమావేశంలో ఉమామహేశ్వరి, రమణమ్మ, చక్రవేణి, సత్యనారాయణ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'మన్ కీ బాత్'ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు

పిఠాపురం: దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 30న నిర్వహించే మన్ కీ బాత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రంబాల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహిస్తున్న 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని ప్రతి పోలింగ్ బూత్‌లోనూ టీవీ ద్వారా ప్రజలకు చూపించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దాట్ల వెంకటసూర్యనారాయణరాజు, పసుపులేటి సత్యనారాయణ, గండి కొండలరావు, తోట ఏడు కొండలు, పోసన సత్యనారాయణ, పైతన సత్యకుమారి, దువ్వా గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

కొత్తపల్లి: ప్రస్తుత వేసవిలో పశువుల సంరక్షణకు రైతులు చర్యలు తీసుకోవాలని కొత్తపల్లి పశువైద్యాధికారి శ్రీమన్నారాయణ సూచించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల వల్ల వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని పశువులకు ప్రతికూల పరిస్థితులు ఏర్పడతాయన్నారు. ప్రధానంగా గేదెలు, సంకరజాతి పశువులు ఎండ తీవ్రతను తట్టుకోలేవన్నారు. దీని వల్ల పాల ఉత్పత్తి తగ్గడం, ఎదుగుదల రాకపోవడం, ఎదకు వచ్చిన లక్షణాలు కనిపించకపోవడం తదితర సమస్యలు ఏర్పాడతాయన్నారు. సంకరజాతి విదేశీ ఆవులకు పాలదిగుబడి పూర్తిగా తగ్గిపోతుందన్నారు. పశువులను ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 5 గంటల తర్వాత మేతకు వదలాలని, ఎల్లవేళలా చల్లని నీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



పిఠాపురం కోర్టుల సముదాయం వద్ద ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

పిఠాపురం: విజయవాడలో బార్ అసోసియేషన్ సీనియర్ సభ్యుడు బత్తిన హరిరామ్‌పై జరిగిన దాడికి నిరసనగా పిఠాపురం కోర్టులో న్యాయవాదులు మంగళవారం విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రాజారావు, భాస్కర్ మాట్లాడుతూ హరిరామ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పిఠాపురం బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

కొత్తపల్లి: మండలంలోని పలు బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే వర్మ మంగళవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన, అనారోగ్యంతో బాధపడుతున్న వారి కుటుంబాలను పరామర్శించారు. టీడీపీ మండలాధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, సురాడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓషధిలా.. అదిరేలా..!

- ఆరోగ్య ప్రదాయినిగా పేరొందిన వృక్షరాజం
- పసుపు పచ్చగా కనువిందు చేసే సుమాలు
- మెట్టలోని సీబీదేవం రోడ్డులో ఆకర్షిస్తున్న చెట్లు

పెద్దాపురం: ఆకర్షణీయంగా కనువిందుచేసే వృక్ష జాతుల్లో రేలా ఒకటి. శాస్త్ర పరిభాషలో దీన్ని కేసియా ఫిస్టుల్లా అంటారు. పలు వ్యాధులను నయం చేసే గుణాలు ఉన్నందున సంస్కృతంలో అరగ్వదగా.. అంటే రోగ నివారని అని అర్థం. ఆంగ్లంలో గోల్డెన్ రెయిన్ ట్రీగా, హిందీలో అమల్‌బాస్‌గా పిలుస్తుంటారు. ఒక్క ఆకు కూడా కనపడకుండా గుత్తులుగా వేలాడే పసుపు పచ్చని పూలతో ఎంతో అందంగా కనిపిస్తుంది. పట్టణానికి ఎనిమిది కిలో మీటర్ల దూరం మండల పరిధిలోని చినబ్రహ్మదేవం గ్రామ రహదారిలో పసుపు పచ్చటి ఆవరణలో మెట్ట ప్రాంత ప్రజలను ఈ చెట్లు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

సర్వరోగ నివారిణిగా..

అద్భుతమైన ఔషధంగా పలు రోగాలను ఈ చెట్టులోని విభాగాలు నయం చేస్తాయి. కొంతమంది దేవతా వృక్షంగా దీన్ని భావించి చుట్టూ తిరుగుతూ రేలారేలారే అంటూ పాటలు పాడేవారు. దీని బెరడను ఆయుర్వేదంలో నొప్పి నివారణకు, గాయాలు శుభ్రపర్చే ఔషధంగాను వినియోగిస్తున్నారు. దీన్ని పొడవాటి కాయల్లోని పిప్పిని మందుగా వినియోగిస్తున్నారు. పేగు ద్రవ్యరాశిలో నీటి సమతుల్యాన్ని కాపాడేందుకు దీన్ని వినియోగిస్తారు. చర్మరోగ నివారణకు చక్కగా పని చేయడమే కాకుండా, జ్వరం తగ్గించేందుకు దోహదపడుతుందని ఆయుర్వేద వైద్యులు చెప్తున్నారు. ఏప్రిల్, మే నెలలలో మాత్రమే ఈ పూలు విరగపూస్తాయి. దీని భాగాలు రుమాటిజం, గౌట్ వ్యాధుల నివారణకు ఉపయోగపడతాయి. రేలా చెట్టు ప్రాధాన్యం తెలుసుకున్న ప్రతి ఒక్కరూ పెరట్లో పెంచుకుంటే పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్య సంరక్షణకు ఉపకరిస్తుందని నిపుణులు చెబుతున్నారు.



సీబీ దేవం రోడ్డులో ఆకర్షిస్తున్న రేలా వృక్షం

పాదగయలో ఇక కూల్ కూల్

పిఠాపురం: ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 8 గంటలకే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. 11 గంటలు దాటాక కాలు ఇంటి నుంచి బయట పెట్టలేని పరిస్థితి నెలకొంది. కాగా ఆలయాల్లో పాదరక్షలు లేకుండా తిరగాల్సి రావడంతో కాళ్లు కాలిపోయి భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. కాగా ప్రస్తుత వేసవిలో స్థానిక పాదగయ క్షేత్రంలో భక్తుల కాళ్లు కాలకుండా ఆలయ అధికారులు ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకున్నారు. ఆలయం బయటి నుంచి లోపలకు వచ్చే ప్రాంతంలో భక్తుల కాళ్లు కాలిపోకుండా దారి పొడవునా కూల్ పెయింటింగ్ వేస్తున్నారు. గతంలో వేసిన రంగు వెలిసిపోవడంతో భక్తులకు ఇబ్బంది లేకుండా కొత్తగా రంగులు వేయించి రక్షణ చర్యలు తీసుకున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుత వేసవిలో భక్తుల సౌకర్యార్థం మహాశివరాత్రికి వేసిన చలువ పందిళ్లను అలాగే ఉంచినట్టు చెప్పారు.



పిఠాపురం పాదయగ క్షేత్రంలో భక్తుల కాళ్లు కాలకుండా వేసిన కూల్ పెయింటింగ్

ఏకశిలా నందీశ్వరునికి గజ్జెల పూజ

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో వేంచేసిన ఏకశిలా నందీశ్వరునికి మంగళవారం ఉమారామ లింగేశ్వర కోలాట భజన మండలి ఆధ్వర్యంలో చిన్నారులు గజ్జెల పూజ నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకుడు వీరబాబు దత్తులు చిన్నారుల గజ్జెలకు, చిడతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీదాస సాహిత్య ప్రాజెక్టు వారి పర్యవేక్షణలో చాగల్లుకు చెందిన నిమ్మగడ్డ వెంకట శివరామకృష్ణ ఆధ్వర్యంలో నందీశ్వరుని సన్నిధిలో చిన్నారులు గజ్జెలు కట్టి కోలాటం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు కోలాటంలో శిక్షణ ఇచ్చిన గురువులు చెరుకూరి ఆదిత్యశర్మ, గోపాలకృష్ణలను ఆలయ సేవా సమితి ఆధ్వర్యంలో పూలమాల, శాలువాలతో సత్కరించారు. శ్రీకృష్ణుని వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.



నందీశ్వరుని సన్నిధిలో కోలాటం నిర్వహిస్తున్న చిన్నారులు

భక్తిశ్రద్ధలతో శంకర జయంతి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఆది శంకరాచార్యుల జయంతిని నిర్వహించారు. నంది మండపం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పండితులు వేమూరి సోమేశ్వర శ్మర, కొంతేటి జోగారావు, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు వినయ్ పూజలు నిర్వహించారు.

ఆరుద్ర నక్షత్ర పూజలు

స్వామి వారి జన్మ నక్షత్రమైన ఆరుద్రను పురస్కరించుకొని భీమేశ్వరస్వామికి మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.



ఆది శంకరులకు పూజలు చేస్తున్న పండితులు

ట్రాక్టర్ నుంచి పడి వ్యవసాయ కూలీ మృతి

సామర్లకోట: మండల పరిధిలో పీబీ దేవం సమీపంలో మంగళవారం ట్రాక్టర్ నుంచి పడి ఒక వ్యవసాయ కూలి మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం ధాన్యం ఎగరబోత ట్రాక్టరుపై పీబీ దేవం నుంచి రామచంద్రపురం వెళ్తున్న ముగ్గురు కూలీలు ట్రాక్టర్ ఇంజన్‌పై కూర్చున్నారు. ట్రాక్టర్ అదుపు తప్పడంతో అడ్డతీగల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన పట్టిం నాగరాజు (30) జారిపడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. జట్టు కూలీకి చెందిన కిర్రపు శ్రీను ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ట్రాక్టర్ నుంచి పడి మృతి చెందిన నాగరాజు

అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- జొన్నలగరువులో గడప గడపకూ మన ప్రభుత్వం

కొత్తపల్లి: రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని యండపల్లి శివారు జొన్నలగరువులో మంగళవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల రూపంలో చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా కోటి గృహాలను దిగ్విజయంగా సందర్శించి వారికి అందుతున్న సంక్షేమాన్ని వివరించినట్లు తెలిపారు. 79 లక్షల కుటుంబాల నుంచి వచ్చిన మిస్డ్ కాల్స్ ప్రభుతంపై ఉన్న నమ్మకాన్ని తెలియపరుస్తున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుతంలో పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీలను ఆశ్రయించాల్సిన దుస్థితి ఉండేదని, తమ ప్రభుత్వంలో నేరుగా ప్రజల వద్దకే పథకాలు చేరుతున్నాయని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. పిఠాపురం నియోజకవర్గాన్ని గత ప్రభుత్వం పూర్తిగా అశ్రద్ధ చేసిందన్నారు. గతంలో ఒక్కరోడ్డు కూడా సరిగా లేక పరిస్థితి అత్యంత దయనీయంగా ఉండేదని, అటువంటి దుస్థితి నుంచి దశల వారీగా ప్రగతి బాట పట్టించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. స్థానికుల సహకారం, అధికారుల సమన్వయంతో నియోజకవర్గంలో విస్తృతంగా అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీలం పెద్దఅప్పారావు, ఉప సర్పంచ్ గండ్ర చిన్నారావు, ఎంపీటీసీ బర్రే రవి, యండపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు గుండ్ర రాజుబాబు, కన్వీనర్ గుండ్ర జగ్గారావు, జ్యోతులు చక్రబ్బాయి, మచ్చ శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



జొన్నలగరువులో మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

సీఎం జగన్ వెంటే జనం

- పీపుల్స్ సర్వేకు అనూహ్య స్పందన
- ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే జనం ఉన్నారని, పారదర్శకంగా లబ్ధిదారుల ఇంటికే పథకాలు అందిస్తుండడంతో ప్రజలు జగనన్నే మా భవిష్యత్తు అంటున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం మంగళవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. పిఠాపురం నియోజకవర్గంలో పీపుల్స్ సర్వేకు అనూహ్య స్పందన వస్తోందన్నారు. ప్రతిఇంటికీ వెళ్లి ఐదు ప్రశ్నలతో కూడిన ప్రభుత్వ పనితీరును లబ్ధిదారులకు చదివి వినిపించి వారి అభిప్రాయాలు తెలుసుకుంటుంటే అందరూ తమకు అన్ని పథకాలు సక్రమంగా అందుతున్నాయని, వైస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారన్నారు. ఇప్పటివరకూ పిఠాపురం నియోజకవర్గంలో సుమారు 23 వేల మంది కుటుంబాలు తమ ఫోన్లతో మిస్డ్ కాల్స్ ఇచ్చి ప్రభుత్వానికి మద్దతు పలికారన్నారు. గ్రామాల్లో ప్రజలు తాము వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులమంటూ సీఎం వైఎస్ జగన్ ఫొటోతో కూడిన స్టిక్కర్లను తమ ఇంటి గోడలకు అతికించుకుంటున్నారని తెలిపారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో నిర్వహిస్తున్న పీపుల్స్ సర్వే సుమారు 65 వేల కుటుంబాల్లో పూర్తయ్యిందన్నారు. ఏ ఇంటికి వెళ్లినా మాకు ఏ ఒక్క పథకం రాలేదని చెప్పిన వారు కనిపించడం లేదన్నారు. నాయకుల ప్రమేయం, పైసా ఖర్చు లేకుండా తమకు పథకాలు అందుతున్నాయని ప్రతిఒక్కరూ చెబుతున్నారన్నారు. పథకాల పంపిణీలో అక్రమాలు జరిగాయని తప్పుడు ప్రచారాలు చేస్తున్న టీడీపీ నేతలకు దమ్ముంటే ఒక్కటైనా నిరూపించాలని సవాల్ విసిరారు. కుల, మత, వర్గ భేదాలు, పైరవీలు లేకుండా అర్హత ఒక్కటే ప్రామాణికంగా ప్రతిఒక్కరికీ పథకాలు అందిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్న ప్రతి పక్షాలకు బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

సమష్టిగా తరిమేద్దాం.. సమాజాన్ని రక్షిద్దాం

- ఘనంగా ప్రపంచ మలేరియా దినోత్సవం
- గ్రామాల్లో జోరుగా అవగాహన ర్యాలీలు

పిఠాపురం: ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీల్లో మున్సిపల్, ఆరోగ్య సిబ్బందిఅవగాహన ర్యాలీలు చేశారు. పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనర్లు ఎం.రామ్మోహన్, సత్యనారాయణ ఆధ్వర్యంలో మున్సిపల్, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది ప్రజలకు మలేరియా నివారణపై అవగాహన కల్పించారు. గొల్లప్రోలు పీహెచ్‌సీలో హెల్త్ సూపర్‌వేజర్ అహ్మద్‌బాషా రోగులకు మలేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



గొల్లప్రోలు పీహెచ్‌సీలో రోగులకు మలేరియా నివారణపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు



పిఠాపురంలో ర్యాలీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేయాలి

పిఠాపురం: విద్యా ప్రమాణాల మెరుగుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ ఆర్‌వీ ప్రసాద్ సూచించారు. పిఠాపురం ఎంఆర్‌సీ భవనంలో మంగళవారం ఉపాధ్యాయులకు సోషల్ ఆడిట్‌పై నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. విద్యా ప్రమాణాల మెరుగుకు ఉపాధ్యాయులు కృషి చేయడంతో పాటు తల్లిదండ్రులు కృషి చేసేలా అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల అభివృద్ధిలో భాగంగా మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యం, విద్యార్థుల భద్రత, ఉపాధ్యాయుల పనితీరు తదితర అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్షా సీఎంఓ చామంతి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న జిల్లా సమగ్ర శిక్షా సీఎంఓ చామంతి నాగేశ్వరరావు

29న కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 29వ తేదీ ఉదయం 10.30కు ప్రారంభం అవుతుందని మున్సిపల్ కమిషనర్ సీఎంపీ నయీం అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. అధికార, ప్రతిపక్ష సభ్యులతో పాటు ఆయా శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట: మండల పరిధిలోని వేట్లపాలెం గ్రామంలోని 11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మేడపాడు ఇండస్ట్రియల్ ఫీడర్ మరమ్మతుల వల్ల బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ జి. ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని వల్ల వేట్లపాలెం, మేడపాడు గ్రామాల్లో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు.



ఏలేశ్వరంలో మోటారు బైక్‌పై టోపీ, సైకిల్‌పై ముసుగు ధరించి వెళుతున్న మహిళలు



నిర్మానుష్యంగా మారిన లింగంపర్తిరోడ్

భానుడి భగభగలు

ఏలేశ్వరం: ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 8 గంటలకే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. వేసవి తాపానికి నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ఉదయం నుంచి ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నియోజకవర్గంలో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండలకు ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల తగ్గుముఖం పట్టారు. ప్రధానరహదారులు జనసంచారం లేక వెలవెలబోయాయి. జాతీయరహదారి సైతం మధ్యాహ్న సమయంలో నిర్మానుష్యంగా దర్శనమిచ్చింది. వాహనదారులు ఎండను తట్టుకొనేందుకు టోపి, ముసుగులు ధరించారు.

కలర్ ఫుల్ కోడి పిల్లలు



కొత్తపల్లిలో రంగురంగుల కోడి పిల్లలను కొనుగోలు చేస్తున్న చిన్నారులు

పిఠాపురం: కోడిపిల్లలు చూడడానికి ముద్దుగా ఉంటాయి. వాటిని చూస్తే చిన్న పిల్లలు తెగ సరదా పడతారు. కాగా కోడి పిల్లలను అమ్మే వ్యాపారులు విద్యార్థులు, జనాన్ని ఆకర్షించడానికి వాటిని కలర్ ఫుల్‌గా తయారు చేస్తున్నారు. మామూలుగా కోడి పిల్లలు తెలుపు, నలుపు, ఎరుపు రంగుల్లో ఉంటాయి. కాని వ్యాపారులు మాత్రం చూడడానికి ఆకర్షణీయంగా ఉండేందుకు వాటికి వివిధ రంగులు పూసి కలర్ ఫుల్‌గా తయారు చేస్తున్నారు. కాగా వాటిని కొనేందుకు జనం ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో రంగురంగుల కోడి పిల్లల అమ్మకాలు జోరుగా జరుతున్నాయి.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

పిఠాపురం: మండలంలోని విరవకు చెందిన ఓ వివాహిత మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పిఠాపురం రూరల్ ఎస్సై అబ్దుల్ నబీ తెలిపారు. వివరాల్లోకి వెళితే... కిర్లంపూడి మండలం సింహాద్రిపురం గ్రామానికి చెందిన తోలేటి సూర్యకుమారికి పిఠాపురం మండలం విరవకు చెందిన లోవరాజుతో 11 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు మగ సంతానం. కాగా మంగళవారం ఉదయం 7 గంటలకు ఇద్దరు పిల్లలకు స్నానాలు చేయించి దుస్తులు వేసి స్కూల్‌కు పంపింది. కొంతసేపటికి బయటకువెళ్లి వచ్చిన భర్త చూసే సరికి ఆమె అనుమానాస్పదస్థితిలో పడిపోయి కనిపించింది. స్థానికులు సాయంతో ఆమెను ఒక ప్రైవేటు ఆర్ఎంపీ దగ్గరకు తీసుకుని వెళ్లగా ఆమె అప్పటికే చనిపోయినట్టు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సంస్కృతిపై అవగాహన పెంచాలి

తుని: ప్రస్తుత విద్యా విధానంలో లలిత కళలను భాగం చేసినప్పుడే భారతీయ సంస్కృతి, కళలపై విద్యార్థులకు అవగాహన ఏర్పడుతుందని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ప్రొఫెసర్ అభిలాష్ పిళ్లై అన్నారు. మంగళవారం స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థలకు విచ్చేసిన ఆయన విద్యార్థులతో సమావేశమయ్యారు. మన సంస్కృతీ సంప్రదాయాలను ఇతర దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని, మనం భవిష్యత్తు తరాలకు వీటి విశిష్టతను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా న్యూఢిల్లీ ప్రఖ్యాత నటి జిల్‌మిల్ హజారికా మాట్లాడుతూ విద్యతో పాటు నాట్యం, అభినయం తదితర రంగాల్లో యువత ఆసక్తి చూపాలన్నారు. ఇన్నోవేటివ్ థియేటర్ డైరెక్టర్ తూము శివప్రసాద్, ప్రిన్సిపాల్ కె.వీర్రాజు, బంగార్రాజు, పెనుగొండ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.